# మంచుపల్లకి

లక్ష్మీ భారతి రెడ్డి



**మా**రుతున్న కాలంతోపాటు మనమూ, మన ఆచార వ్యవహారాలు మారిపోతున్నాయి. ఇంతకూ మారింది కాలమా? మనమా? కాలానిదేం పొరపాటు లేదు. అదెప్పుడూ నిత్య నూతన యవ్వన సౌరభాల సుగంధమే. మారింది మనమే. స్పీడు యుగం, మాడ్రన్ కల్చర్. ఈ రెండింటి మధ్య శవాసన దిశగా సాగిపోతున్నాయి మన సంప్రదాయాలు. అందుకే ఈ మంచు పల్లకి ద్వారా మేలుకొలుపు.

❋ ❋ ❋

బాబూ వర్మా!

ముప్పై ఏళ్ళయ్యింది నిన్ను చూసి. పై చదువులకని నిన్ను అమెరికా పంపించి చాలా పెద్ద పొరపాటే చేశాం మేం. పై చదువులు పూర్తి చేసి, పెళ్ళికూడా అక్కడే చేసుకున్నావు. ఫోటోలు మాత్రం మాకు పంపావు. కన్నవారి రుణాన్ని తీర్చుకుంటూ నెలనెలా డబ్బు పంపుతున్నావు నిజమే. కానీ డబ్బే సర్వస్వం కాదు నాయనా. దాంతో కొనలేనివి ఎన్నో ఉన్నాయి. కన్నీళ్ళు, కన్నతల్లి చనుబాలు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. ఎన్ని సంక్రాంతి పండుగలొచ్చి వెళ్ళాయి. కానీ కొడుకు, కోడలు, మనవడ్ని చూసుకోవాలనుకున్న మా ఆశలకు మాత్రం సంక్రాంతి రాలేదు.

నా మనవడు పుట్టి 21 సం॥లు అయ్యింది. ఫోటోల్లో చూడ్డం తప్ప ఏదీ ప్రత్యక్షంగా చూసుకోవడం, మీరు సంపాదించే డాలర్ల వెనక పరిగెత్తలేక అభిమానాలు, అప్యాయతలు వెనకపడి అలసిపోయాయి. ప్రతి సంక్రాంతికీ మిమ్మల్ని రమ్మంటూ మేం ఉత్తరాలు రాయడం, వీలు కావడం లేదని మీరు జవాబు రాయడం పరిపాటైపోయింది. అందుకే మీరు రాకపోయినా, మా మనవడ్ని అయినా పంపమని కోరుతున్నాం. కనీసం వాడిలో నిన్నైనా చూసుకోని. మీ అమ్మతోపాటు నా దీవెనలు మీ అందరికీ ఉంటాయి, ఉంటాను!

ఇట్లు మీ నాన్న!

❋ ❋ ❋

గౌరవనీయులైన నాన్నగారికి నమస్సులతో!

మీ ఉత్తరం చదివాక చాలా మనఃస్తాపానికి గురైయ్యాను. ఎంత కలత చెంది ఏం లాభం? పోగొట్టుకున్నవి పొందలేం. తిరిగి పొందాలంటే జీవిత కాలం సరిపోదు.

మీ కోడలు జెన్నిఫర్ కూడా మీ మనవడ్ని పండక్కి మీ వద్దకు పంపేందుకు ఒప్పుకుంది. సంక్రాంతికి ఓ రోజు ముందే వాడిక్కడ ఉంటాడు. మేం మిమ్మల్ని మరువలేదు నాన్నా. అందుకే మీ పేరుని మీ మనవడికీ పెట్టుకున్నాం 'అవధాని' అని. అమ్మకు నమస్సులు తెలిపేది.

ఎప్పుడూ మీ ఆశీస్సులు కోరుకునే

మీ కొడుకు వర్మ

ఉత్తరం చదివి చాలా ఆనందపడ్డారు ఆ ముసలి దంపతులు. అమెరికా యూనివర్సిటీలో వర్మ, జెన్నిఫర్ ఇద్దరూ చదువుకున్నారు. కాలేజీ ప్రేమ వారిలోనూ పుట్టింది. పెరిగి పెద్దదై పెళ్ళికి దారి తీసింది. వర్మ ఇండియన్, జెన్నీఫర్ అమెరికన్. పెళ్ళయ్యాక జెన్నీఫర్‌కు తెలుగు నేర్పించడం కోసం వర్మ చేసిన భగీరథ ప్రయత్నం చాలా ఏళ్ళకుగానీ ఫలించలేదు.

అక్కడే మంచి ఉద్యోగం దొరకటంతో కాలం వర్మను అమెరికాలోనే కట్టిపడేసింది. సంపాదనతోపాటు ఓ కొడుకూ పుట్టాడు. ఇంగ్లీష్‌తోపాటు తెలుగూ అతనికి నేర్పించారు వారు.

❋ ❋ ❋

ఇండియా ప్రయాణం గురించి కొడుకు అవధానికి చెప్పారు వర్మ, జెన్నిఫర్ ఇద్దరూను. ఆనందించాడు అవధాని. నాన్న వర్ణనల్లో తప్ప సంక్రాంతిని ఇంతవరకు చూడలేదు. అలాంటి అదృష్టం ఇప్పుడు రావడంతో అతని ఆనందానికి అవధులు లేవు.

వీసా, టిక్కెట్లు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక కొడుకును ఎయిర్ పోర్ట్‌లో వదలి 'చూడు నాన్నా ఇండియాలో దిగగానే ఫోన్ చెయ్యి. మీ నానమ్మను, తాతయ్యనూ అడిగానని చెప్పు" అన్నాడు వర్మ.

జెన్నిఫర్ అభిమానంగా నుదుటన ముద్దిచ్చి "వెళ్ళిరా బాబూ"అంది.

❋ ❋ ❋

తాతగారి ఇల్లు చేరుకున్నాడు అవధాని. అదో పల్లెటూరు. అమెరికాలో భారీ అంతస్తులు చూసిన అతనికి ఇక్కడి పూరి గుడిసెలు, అక్కడక్కడా ఉన్న చిన్నచిన్న మిద్దెలు విచిత్రంగా కనిపించసాగాయి.

మనవడొచ్చాడన్న సంబరంతో ఉరంతా హం గామా చేశారా దంపతులు.

అమ్మా సొన్నల తర్వాత మళ్ళీ అంతటి ప్రేమ ను తాతయ్య, నానమ్మలద్వారా చవిచూశాడతను.

తెల్లారితే సంక్రాంతి.

అవధానికి చాలా ఉత్సాహంగా ఉంది. ఎప్పు డెప్పుడు తెల్లారుతుందా, నాన్న చెప్పిన సంక్రాంతి సంబరాలు భోగిమంటలు, హరిదాసులు, గంగి రెద్దులు ప్రతి ఇంటి ముంగిట్లో రంగురంగుల ముగ్గులు, ఆ ముగ్గుల మధ్యలో గొబ్బెమ్మను చూద్దా మని ఆ రాత్రి అతనికి ఓ పట్టాన నిద్ర రాలేదు.

తెల్లవారుజామున నాలుగింటికే నిద్రలేచి వీధి అరుగుమీద కూర్చున్నాడు సంక్రాంతి సంతోషాల్ని చూద్దామని.

కాసేపటికి కామాక్షమ్మ బైటకొచ్చి అరుగుపై కూర్చున్న అవధానిని చూసి 'ఏంటి బాబూ? అప్పుడే లేచిపోయావా?' అంటూ ప్రశ్నించింది. నానమ్మ వైపు చూశాడు అవధాని, తలంటు స్నానం చేసినట్టుంది. తల వెంట్రుకలకు తెల్లని గుడ్డ చుట్టుకుని ఉంది.

'నానమ్మా'

'ఏంటి నాన్నా?'

'సంక్రాంతి గురించి నాన్నగారెంతో గొప్పగా చెప్పారు. ఇక్కడేంటి తెల్లారబోతున్నా ఎవరూ నిద్ర లేవలేదు. ఏ భోగిమంటలూ లేవు'

'అదా హ ఏం చెప్పన్నాయనా, కలికాలంరా బాబూ. నీకు భోగిమంటే కదా కావాలి? ఒక్క నిముషం ఉండు' అని లోనికెళ్ళి నాలుగు పాత చాటలు, పొరకలు, గంపలు బైటకు తెచ్చి ఇంటి ముందు వేసి కిరసనాయిలు పోసి అంటించి –

"చూడు బుజ్జీ ఇదీ భోగిమంటంటే చూసుకో' అనేసి ఆ వెలుతుర్లో రంగు రంగుల ముగ్గు వేయడం ప్రారంభించింది.

నానమ్మ ముగ్గు కళా నైపుణ్యం చూస్తూ కన్నార్పడం మరచిపోయాడతను.

ముగ్గు పూర్తయ్యాక లోనికెళ్తూ లోనికి రమ్మన్న నానమ్మతో "ఇప్పుడు కాదులే నానమ్మ మీరెళ్లండి నేను తర్వాత వస్తాను" అన్నాడు అవధాని.

"ఇక్కడే ఉండు నాయనా.. ఆ ఎవరు నిద్ర లేచారు?ఏ ఇంటి ముందు భోగిమంటలున్నాయా? అని వీధులంట పోయేవు. అసలే ఊరికి కొత్త అలా అలా చూసుకుంటూ పోయి ఊరవతలకు వెళ్ళా వంటే మళ్ళీ తిరిగొచ్చేందుకు మా ఊళ్ళో వీధి నెంబర్లు, ఇంటి నెంబర్లు లేవు. అలా వెళ్ళినా మేం వెతుక్కుంటాంలే" అందామె.

నానమ్మ మాటల్లోని చమత్కారానికి నవ్వు కున్నాడు అవధాని. గంట తర్వాత తాతగారు బైటకొచ్చారు.

"ఎక్కడికి తాతయ్యా?" ప్రశ్నించాడు అవధాని.

"సూర్యోదయం కాబోతోంది. సూర్య నమ స్కారాలకు నాయనా!" అంటూ పెరట్లోకి వెళ్తున్న తాతగార్ని చూసి,

"ఇదేంటి? సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం సూర్య నమస్కారం చెరువులో మునిగి దోసిళ్ళలో నీళ్ళు తీసుకుని, వదులుతూ అర్పించాలికదా?" అని మనసులోనే అనుకుంటూ తాతగార్ని అనుసరించాడు.

తాతగారు పెరట్లోని ఓ నీళ్ళ తొట్లో నిల్చొని తూర్పువైపు చూస్తూ తొట్లోని నీళ్ళను దోసిళ్ళతో తీసుకుని తిరిగి వదుల్తూ సూర్య నమస్కారం చేస్తున్నారు.

అయిదు నిమిషాల తర్వాత తొట్లోంచి బైటపడ్డ తాతగార్ని సమీపించి అడగబోతున్నంతలోనే అయనే అందుకుని,

"నీ సందేహం అర్థమైంది బాబూ! వర్షాలు సక్రమంగా కురిసి ఏడేళ్ళయ్యింది. చెరువుల్లోనూ, పంట పొలాల్లోనూ కంప చెట్లు మొలిచిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా సంస్కృతి సంప్రదాయాలకు నీళ్ళొదులుకోని మాలాంటివారికి తొట్లే చెరువులయ్యాయి" బాధగా అన్నాడు.

ఉదయం ఏడింటికల్లా అచ్చమైన ఆంధ్రా టిఫిన్ ఆరగించేశాడు అవధాని. ఘాటైన ఉల్లి చట్నీ, ఎండుకారంలో కాసింత నెయ్యి వేసుకుని నానమ్మ చేసిన నేతిపడలు, దోశెలు ఆ కారానికి కళ్ళు దిమ్మరిల్లినా, ఆనందం అతన్ని తట్టుకునేలా చేసింది. అమెరికాలోనూ ఇంతే. ప్రతి సంక్రాంతికి ఇవే వంటలు. కాలేజీకి వెళ్ళి ఆకలై తప్పనిసరి పరిస్థితుల్లో హంబుర్గల్లూ, ఫ్రెంచ్ ఫ్రైస్‌లు తిన్నా ఇంటికొచ్చాక, నాన్నగారి తర్ఫీదులో ఆరితేరిన అమ్మ చేసిన వంటకమే అతనికి ఇష్టం. అయితే కారం ఇంతగా ఉండదు మరి!

❄ ❄ ❄

మళ్ళీ వీధి అరుగెక్కాడు అవధాని. గంగి రెద్దులు ఎప్పుడొస్తాయా, హరిలో రంగ హరి అని పాడుకుంటూ హరిదాసులెప్పుడొస్తారా? అని చూస్తున్నాడు.

చుట్టుపక్కల ఇళ్ళలో నుండి వివిధ తెలుగు ఛానళ్ళలో వినిపిస్తున్న సంక్రాంతి శుభాకాంక్షల జోరు తప్ప తనెవరి కోసం ఎదురు చూస్తున్నాడో వారు మాత్రం రాలేదు. ఇలా నిరాశ నిస్పృహలతో ఉన్న అవధానికి అచ్చమైన ఆంధ్రా దుస్తులు వేసుకున్న కొంతమంది యువకులు ఆ వీధిలోనే ఓ ఇంటిముందు కొన్ని నిముషాలు నిలబడి ఆ ఇంటివారితో మాట్లాడి, కదిలి మరో ఇంటి ముందు వాకిట్లో నిలబడ్డం కనిపించింది.

వచ్చేస్తోంది సంక్రాంతి సంబరం బహుశా వారి వెనకే గంగిరెద్దులు, హరిదాసులూ రావచ్చు అనుకున్నాడు అమాయకంగా. ఆ యువకులు అతని దగ్గరకొచ్చారు అరగంట తర్వాత.

"నమస్తే సంక్రాంతి శుభాకాంక్షలు సార్! ఈ నవ్య సంక్రాంతి మీకు, మీ కుటుంబానికి, మీ బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు దివ్య కాంతులివ్వాలని ఆశిస్తున్నాం."

ఆనందపడి "మీకునూ" అన్నాడు అవధాని.

"ఇవి కూపన్లు సార్. ఒక్కోదాని వెల నూర్రూపాయలు మాత్రమే. రేపు సంక్రాంతి లక్ష్మికి సంబరాలు చెయ్యబోతున్నాం. కూపన్లకు చెంబు, తపేళాలు, వంట సామాగ్రి ఇలాంటి ఎన్నో ప్రైజులు పెట్టామండీ" ఆ గుంపులోంచి ముందు కొచ్చిన వ్యక్తి కూపన్ కట్టను అందించాడు అవధానికి.

"సంక్రాంతి లక్ష్మా? ఎక్కడయ్యా తెల్లారుజాము నుంచి ఎదురు చూస్తున్నా" అంటూ అటూ ఇటూ చూశాడతను. దానికి వాళ్ళేదో చెప్పారు. అర్థంకాక అవధాని ఇంకేదో అడిగాడు. దాదాపు పది నిము షాల చర్చల తర్వాత "సంక్రాంతి లక్ష్మి ఎక్కడుంటే ఏంటి? ముందీ తలనొప్పిని వదిలించుకోవాలి" అనుకుని జేబులోంచి ఓ పది డాలర్ల నోటును తీసుకుని వారికిచ్చాడు. 'థ్యాంక్స్' అని ఆ గుంపు అక్కడి నుంచి కదిలింది. హరిదాసులూ, గంగి రెద్దులూ లేకనే అవురా సంక్రాంతి అని మనసు లోనే అనుకున్నాడు అవధాని.

❄ ❄ ❄

నాల్రోజుల తర్వాత!

నానమ్మ, తాతయ్యలు వీడ్కోలు పలుకుతుం డగా నమస్కారం చేశాడు అవధాని.

"మా నాయనే ఎంత భక్తిశ్రద్ధలు పెద్దలంటే. జీపతను మనకు తెలిసినోడే. క్షేమంగా నిన్ను ఎయిర్‌పోర్ట్‌కు చేరుస్తారు. ఏదో నేనూ వస్తా బాబూ. అంటే వినిపించుకోవు" అభిమానంగా అన్న తాతయ్య చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని,

"ఏదో మొదటిసారి రావడంతో నేను వచ్చేటప్పుడు మీకు శ్రమ కలిగించాను. ఇప్పుడా అవసరం లేదు, మళ్ళీ మీకు శ్రమెందుకు?" అంటూ నానమ్మను చూస్తూ,

"వస్తా నానమ్మా! మీ ఆరోగ్యాలు జాగ్రత్త" అంటూ జీపెక్కబోయి మళ్ళీ ఆగి,

"ఆ మీకో విషయం చెప్పాలి. స్వదేశంలో మనం మన పండగల్ని మరిచిపోతున్నాం. అదే విదేశాల్లో ఉన్నవారైతే క్యాలెండర్లో చూసుకుని ఆ పండుగల్ని దర్జాగా జరుపుకుంటున్నారు. సంక్రాంతితో సహా అన్ని పండుగలూ. ఇలా ఎన్నో పండుగలు విదేశాల్లో ఉంటున్న ప్రతి భారతీయుడి గుండె గదుల్లో హుందాగా ఉన్నాయి" అని జీపెక్కాడు అవధాని. ←

## మీకు తెలుసా?

### అత్యంత ధనికులు

విప్రో సాఫ్ట్ వేర్ కంపెనీ అధిపతి, బెంగుళూర్‌కి చెందిన అజిమ్ ప్రేమ్‌జీ ఇండియాలో అత్యంత ధనికునిగా గుర్తింపు పొందారు. 31,198 కోట్ల రూపాయలకు అధిపతిగా, సక్సెస్ 2005 బిజినెస్ పత్రిక పేర్కొంది. ముఖేష్, అనిల్ అంబానీలు సంయుక్తంగా 24,172 కోట్లలో రెండవ అత్యంత ధనికులుగా గుర్తింపు పొందారు.

### పప్పూ యాదవ్ తీరే వేరు!

బీహార్‌కు చెందిన ఆర్.జె.డి. ఎం.పి., క్రిమినల్, పప్పూ యాదవ్ బేయూర్ జైల్లో నుండి రోజుకి 22 ఫోన్‌కాల్స్ చొప్పున నవంబరు 04'లో 670 ఫోన్ కాల్స్ తన మొబైల్ ద్వారా చేసాడట!

### ఇది ఇండియా!

మన దేశంలో 4.03 కోట్ల మంది మురికి వాడల్లో నివసించే నిరుపేదలట! – *గాయత్రి*